

# పంతులుగారి భార్య

అలివేణికి చాలా సంతోషంగా వుంది. ఆ సంతోషాన్ని ఎవరితో అయినా పంచుకుంటేనేగాని తృప్తి వుండదని పించింది. స్టాండ్ మీద టిక్కు టిక్కు మని సన్నగా శబ్దంచేసే టైమ్‌పీసు వంక చూసింది. ఇంకా అయిదు పూర్తికాలేదు. తన భర్త రావడానికికింకా గంటన్నర టైము వుంది. ఎన్ని పనులుచేస్తే ఆ గంటన్నరా పూర్తవుతుందో?

చేసినపనే చేస్తున్నది. సర్దిన సామానే తిరిగి సర్దుతూ కాలక్షేపం చేయసాగింది.

పక్కింటి బామ్మగారు తోడు చల్ల కోసం వచ్చింది ఇంత పెద్ద స్టీలు గిన్నెతో. అలివేణి కూనిరాగం తీస్తూ ఆ పని ఈ పని చేసుకోవడం చూసి చూడరాని దృశ్యమేదో చూసినట్లు ఆశ్చర్యపడింది.

అలివేణి ఆ యింట్లోకొచ్చాక అంత సంతోషంగా ఉండటం ఆమె చూడలేదు. అందుకనే మరీ నిర్విణ్ణురాలయింది. "అమ్మాయ్ కాస్త మజ్జిగ పిసరు వేయమ్మా తోడుకి. మా కోడలు, ఈ పూట తోడుకి లేకుండా చేసింది" అంది. ఎప్పుడన్నా అయితే "మజ్జిగా లేదు, గిజ్జిగాలేదు" అని కసిరేదే కాని ఈ క్షణంలో తను చాలా సంతోషంగా వుంది కనుక అలివేణి మజ్జిగ లేదన కుండా, బామ్మగారు తెచ్చిన గిన్నె సగంవరకూ పోసి ఇచ్చింది. "మా అమ్మే, నీవు భారీచెయ్యే'' అని పొగడ్తూ వెళ్ళిపోయింది బామ్మగారు.

ఎదురింటి పిన్నిగారొచ్చింది గ్లాసెడు పంచదార బదులివ్వమంటూ. 'కోటాలో యిచ్చిన చక్కెర చాలక బ్లాకున రెండు

కేజీలు తెస్తే అదీ పూర్తయ్యిందట. మా పిల్లవెధవలదగ్గర ఏదీ ఆగదమ్మాయ్, గుప్పెళ్ళతో ఎత్తుకుపోయి తినేస్తారనుకో. ఎన్నిటికని తాళంవేయనూ. అదృష్ట వంతురాలివి, నీకింకా పిల్లా పీచూ లేరు కాబట్టి బతికిపోయావు.' సగం విసుగు తోనూ, సగం ఉబ్బేస్తూనూ తను వచ్చిన పని బైటపెట్టింది.

మాట్లాడకుండా గ్లాసునిండా పంచదార పోసి ఇచ్చేసింది అలివేణి. ఆ పంచదార తిరిగి రాదని ఆమెకు, అవసరానికి పని కొచ్చే వస్తువు పట్టుకెళ్ళడమే తెలుసు గాని ఇవ్వడం తెలియదు. ఇచ్చిన వస్తువుని అడిగి తీసుకెళ్ళడం అలివేణికి ఇష్టం వుండదు.

ఇంటివారమ్మాయి కాసిని సన్న జాజులు, కనకాంబరాలు తెచ్చి యిచ్చింది "పెట్టుకో అక్కా" అంటూ. లోగడ ఎప్పుడన్నా ఆ పిల్ల పూలు తెచ్చిస్తే మొహం చిట్లిస్తూ 'నాకెందుకూ' అని తిరగ్గొట్టేసేది. కాని ఈ క్షణంలో తను చాల సంతోషంగా వుంది గనక మాట్లాడ కుండా ఆ పూలన్నీ తీసుకుంది.

దారపుండ తెచ్చి ఆ పూలు కట్టూ కూర్చుంది, నోట్లోంచి సన్నగా కూని రాగం తీస్తూ. ఆ పాట మల్లీశ్వరిలో భానుమతి పాడిన 'మనసున మల్లెలమాల లూగెనే' అన్నపాట. తనకి భానుమతి పాటలన్నా, ఆమె నటించిన సినిమా లన్నా చాల యిష్టం. తను చదువుకునే రోజుల్లో భానుమతి వేసిన సినిమావస్తే 'స్పెషల్ క్లాసుంది' అంటూ మేటనీకి చెక్కేసేది. తన క్లాసు పిల్లలు మంగ తాయారుకి, పంకజానికి పద్మాభాయికి ఎందుకనో భానుమతి అన్నా, ఆమె పాటలన్నా ఇష్టం వుండేవి కావు. 'తనకి చాల గర్వం, నటనలో కూడా ఆమె అహంకారమే కనిపిస్తుంది. ఇక అమ్మవారు పూనినట్లు పాట పాడ్తూ అలా ఊగిపోతుందేం' అని తనని ఏడిపించేవారు. అన్నివిషయాల్లో కలసికట్టుగా స్నేహంగా వున్నా ఈ విషయంలోమాత్రం తమకి కలిసేది కాదు. మాటామాటా పెరిగి నువ్వెంతంటె నువ్వెంతవరకూ వెళ్ళేది. వారం పది రోజులు మూతి బిడాయించుకుని తిరిగే వారు. తర్వాత ఎవరో ఎలాగో కలిపే వారు తమని. అప్పుడు రాజీకొస్తూ "ఆవిడెవరో బాగానటిస్తే మనకేం, నటించకపోతే మనకేం. ఆమె పాట ఊగుతూ పాడితేనేం? ఊగకుండా పాడితే మనకెందుకు. ఎక్కడో వుండి, మనకేంలేకాని, ఆమెకోసం మనంపోట్లాడు కోవడమేమిటి! 'ఛ...ఛ...' అనుకునే వాళ్ళు. ఇప్పుడా విషయాలన్నీ జ్ఞాపకం వచ్చి ముసిముసిగా నవ్వుకుంది అలివేణి. ఏవిటో ఆ జీవితాలు, బాధ్యతలేని బాల్యజీవితాలవి. అప్పుడు లోకమంతా టెక్నికలర్‌లో కనిపిస్తూ ఊహల్లో జీవిస్తూ గడిపిన రోజులవి. ఆ రోజులు

తిరిగిరమ్మన్నా రావుకదా...ఇప్పుడు మంగ, పద్మ, పంకజం, వాళ్ళంతా ఎక్కడున్నారో? ఏంచేస్తూవుంటారో అనుకుంది. 'వాళ్ళూ నాలాగే పెళ్ళి చేసుకుని ఎక్కడో స్థిరనివాసమేర్పరచు కొని, సంసారాలను దిద్దుకుంటూ, పిల్లల్ని లాలిస్తూవుంటారు' అంది అంత రాత్మ ఆ వూహకి నవ్వొచ్చింది.

తన పెళ్ళికానిక్రితమే ఆ ముగ్గురి పెళ్ళిళ్ళూ అయ్యాయి. మంగతాలూరు భర్త ఇంజనీరు, పంకజం భర్త ఏదో ఆఫీసులో పెద్ద ఉద్యోగమే చేస్తున్నాడని వింది. ఇకపోతే పద్మ మొగుడే నాట కాల్లో వేషాలు వేస్తుంటాడని, ఉద్యోగం సద్యోగం లేదని వింది. మరి...మరి తన భర్తో? ఆలోచన తన దగ్గర ఆగిపోయే సరికి విసుక్కుంది అలివేణి. 'ఏం ఆగి పోయావేం? నా మొగుడిగురించి చెప్పు కోవడానికి నాకేం గొప్పలు లేవా? అడిగింది అంతరాత్మ చిలిపిగా ఏం ఉన్నాయి చెప్పకోడానికి. విరక్తిగా పెదవి విరుచుకుంది. బతకలేక బడి పంతులన్నట్లు, పంతులుపని చేస్తున్నాడు. అదీ ఓ గొప్ప ఉద్యోగమేనా? తన కాబోయే భర్తగురించి ఎన్ని ఊహించు కునేది? బాగా చదువుకుని ఉండాలని, మంచిహోదాగల ఉద్యోగంచేయాలని, ఇంటిపనికి, వంటపనికి, బజారుపనికి నౌకర్లు వుండాలని, అన్నిటినీమించి మంచి అందం ఆకర్షణాగలవాడై వుండాలని కోరుకునేది. చివరి అంశం తప్పించి మరేవీలేవు తనభర్తలో. గొప్పగా చెప్పుకోడానికి." బాధగా నిట్టూ ర్చింది అలివేణి.'

అసలు ఆ కారణంగానే, పెళ్ళయి ఆర్నెల్లు కావస్తున్నా భర్తమీద అనురాగం చూపించలేక పోతున్నది ఆమె. అలివేణిభర్త అచ్యుతరావు. అతనికి తల్లీతండ్రీ చిన్నప్పుడే పోవడంతో పెద తండ్రి చేరదీసి పెంచాడు. స్కూలు ఫైనల్‌వరకూ చదువు చెప్పించాడు. ఇంకా చదువుకోవాలనే ఆశవున్నా ఇప్పటికే తను ఒకరిమీద ఆధారపడి ఉన్నాడు. ఆ బరువుని ఇంకా పెంచడం బాగావుండదని టీచర్ ట్రెయినింగ్ పూర్తిచేసి, ఆ ఊళ్లో అప్పర్ ప్రైమరీ స్కూల్లో టీచరుగా చేరాడు.

ఇక పెళ్ళికూడా చేసేస్తే తన బాధ్యత తీరిపోతుందని ఆ ప్రయత్నాలు సాగిం చాడు ఆయన. ఎంతమందినో చూసినా ఒక్కర్నీ ఒప్పుకోని అచ్యుతరావు అలివేణిని చూస్తూనే "ఈ అమ్మాయి నాకు నచ్చింది పెదనాన్నా" అని తన యిష్టాన్ని వ్యక్తంచేసాడు వెంటనే.

ఆయనకు అలివేణి నచ్చింది కాని ఆ అమ్మాయి తండ్రి వెయ్యికంటె ఎక్కువ ఒక్క నయాపైసాకూడా కట్నం ఇచ్చుకోలేనని ఖండితంగా చెప్పే సరికి అంత తక్కువ కట్నానికి ఎలా

ఒప్పుకోవడమా అని తటపటాయించ సాగేడు.

కట్నం ఎక్కువ ఎవరిస్తారా అని ఆయన తిరిగి ప్రయత్నాలు కొనసాగిస్తుంటే "నా చదువు ఉద్యోగం కూడా కనిపెట్టి మరీ చూడాలి పెదనాన్నా. ఎక్కువ కట్నం తెచ్చే అమ్మాయి కోరికలు, ఎక్కువ సంపాయించగల భర్తమీద ఉంటాయికాని నాలాంటి బడి పంతులుమీద వుండవు కనుక ఈ సంబంధం ఖాయం చేయండి' అనే ధోరణిలో చెప్పేసరికి వాడికి అంతగా నచ్చినప్పుడు నే నెందుకు కాదనాలి అనే ఉద్దేశ్యంతో అలివేణినే ఖాయపర్చాడు.

అలివేణికి భర్తచేసే ఉద్యోగం గురించి మొదట తెలీదు. చూట్టానికి అందంగా ఆకర్షణీయంగానే కనిపించే సరికి తండ్రి వచ్చి "ఏవమ్మా ఈ అబ్బాయి నీకు నచ్చినట్లేకదా లేక అనుమానమా" అని అడిగేసరికి, బోలెడంత సిగ్గుపడ్తూ అతను తనకి నచ్చినట్లు అంగీకారం తెలిపింది. ఓ శుభముహూర్తంలో దంపతులయ్యారు. నెలలోనే తన భార్యను వెంటబెట్టుకుని ఆ ఊరొచ్చాడు అచ్యుతరావు

తను కలల్లో ఊహించినట్లు చిన్న బంగళా, ఇంటినిండానౌకర్లులేకపోయినా, కనీసం ఓ మోస్తరు పెద్దఇల్లు, ఇంటి ముందు పూలతోట వగైరా లేకుండా, నాలుగిళ్ళ వాటాలో రెండంటే రెండే గదుల ఇంట్లో కాపురంచూసి, అలివేణికి కంపరం పుట్టింది. మతిపోయినట్లయింది. మొహం ముడ్చుకుంది. మనసునిండా అసంతృప్తి చోటుచేసుకుంది. తనభర్త మరీ ఇంత చిన్న ఉద్యోగా అనే తేలిక భావంతో, రోజులు గడిచేకొలదీ అలివేణిలోని అసంతృప్తి పెరిగిపోతున్నది, ఇదీ ఓ బ్రతుకేనా' అనే ధోరణితో చీటికి మాటికి విసుక్కోవడం, చిరాకు పడటం, భర్త అలా తిరిగివద్దామని మనసారా కోరినా 'ఇంతోటి గొప్ప టౌనులో షికార్లుకూడా నా మనబతుక్కి..' అని హేళనగా ఎత్తిపొడవడం సినిమాకు రమ్మని పిలిచినా 'సినిమాలు నాకిష్టం వుండవు' అనడం, అతను నవ్వుతూ సరసమాడబోతే విదిలించికొట్టడం, కోర్కెతో దగ్గరకు రాబోతే 'నా వంట్లో బాగాలేదు' అనో, తలనొప్పి అనో చెప్పి కింద చాపేసుకుని ముసుగు బిగించడం చేస్తున్నది.

తన భార్య అందచందాలు చూసి, తను చాల అదృష్టవంతుడనని మురిసిపోయిన అచ్యుతరావు మురిపెం మూడు రోజులకే ముక్కలైపోయింది పాపం. నేను చాల దురదృష్టవంతుడుని అని వాపోతుంటాడిప్పుడు. ఇంటికొస్తే భార్య రుసరుసలు, విదిలింపులు చవిచూడాలనే భయంతో స్కూలు వదలగానే ఇంటికి రాకుండా కొన్ని ట్యూషన్లు ఏర్పాటు చేసుకుని గంటో, గంటన్నరో అక్కడే

కాలక్షేపంచేసి చీకటిపడుతుండగా ఇంటి కొస్తాడు. మెదలకుండా భార్య పెట్టింది తిని మాట్లాడకుండా మంచం ఎక్కు తాడు. భార్య వుండీ బ్రహ్మచర్యవ్రతం తప్పడం లేదతనికి. కాని అలివేణికి మాత్రం ఆ ఊళ్లో 'పంతులుగారి భార్య' అనే గౌవరంమాత్రం బాగా వుంది. ఆ గౌరవం చూసుకుని అలివేణి మురుసు కోదు. అదీ ఓ గౌరవమేనా అని విసు క్కుంటుంది

ఆ రోజు ట్యూషన్ చెప్పకునే పిల్లలు లేని కారణంగా త్వరగా ఇంటికొచ్చాడు అచ్యుతరావు. అతనికి గుమ్మంబైట భార్య సంతోషంతో కూనిరాగం తీయడం వినిపించింది. భార్యగొంతు ఇంత బాగుంటుందని తన కిన్నాళ్లూ తెలియదు. ఆ పాట వింటూ గుమ్మంబైటే నిలబడి పోయాడతను, తను లోపలికెళ్తే తనని చూస్తూనే భార్య పాట ఆపి వేస్తుందేమో, మళ్ళీ ఆమె పాట వినే అవకాశం వస్తుందో రాదో అనే భావంతో. చేసేపని పూర్తయిందో లేక, పాట పూర్తయ్యిందో గాని, గదిలోంచి ఎట్టి శబ్దమూ రాకపోయేసరికి ఉస్సురని నిట్టూరుస్తూ గదిలో కాలుపెట్టాడతను. ఆ గది రోజూ ఉండే గదిలా అనిపించ లేదు అతని కళ్ళకి. గదంతా నీటుగా సర్దివుంది. అలివేణి అద్దంముందు నిల బడి తలలో జాజిపూలు తురుముకుంటు న్నది. అతనికి భార్యకూడా చాల అందంగా మెరిసిపోతున్నట్లు, ఆ మొహంలో కోపంతో ధుమధుమలు కాక, మందహాసం చిందులువేస్తున్నట్లు గ్రహించాడు ఏంవిటో ఈరోజు సుదినం అనుకుంటూ భార్యవైపు సంభ్రమంగా చూసాడు.

అద్దంలో భర్తరాకని గమనించిన అలివేణి గిరుక్కుమని తిరిగి అందంగా నవ్వింది గబగబ లోపలికెళ్ళి పొగలు కక్కే కాఫీతోపాటు ప్లేటులో ఇన్ని అరటికాయ బజ్జీలు కూడా తెచ్చి అతని కెదురుగా బల్లమీద పెట్టింది. 'నేను చూసేది కలా, యదార్థమా' అతనికింకా అనుమానంగానే వుంది. అనుమానం తీరక కళ్ళు నులుముకుని మళ్ళీ మళ్ళీ చూసాడు భార్యవైపు, ఆమె తెచ్చిపెట్టిన కాఫీ, ఫలహారాలవైపు.

"అలా చూస్తారేం, ఇవి తిని కాఫీ తాగండి చప్పున. లేకపోతే చల్లారి పోతుంది" అంది గోముగా.

ఇక ఆలోచించకుండా, ఆలోచిస్తే మధురమైన ఆ కల కరిగిపోతుందేమో అన్నట్లు, ఆ బజ్జీలనుతిని కాఫీ త్రాగాడు. కాఫీ చాల బాగుందతనినోటికి. బజ్జీలు కూడా కారంగా, రుచిగా ఉన్నాయి. తన భార్య ఇంత సంతోషంగా ఉండటానికి కారణం ఏంవిటో ఎంతాలోచించినా అత నికి స్ఫురించలేదు.

"కారణం ఏమైతేనేం తనలో మార్పు



వచ్చింది, అది చాలదూ" అంది మనసులోని మరో మనిషి.

'అంతే అంతే, తనక్కావల్సింది భార్య సంతోషంతో కలకల్లాడ్తూ తిరగడంవూ, తనని ఆనందపర్చడంవూ. ఆ కారణంగా ఏదైతేనేం?' నచ్చచెప్పుకున్నాడు మనసుకి. భోజనాలదగ్గర తన అంత సంతోషానికి కారణమేమిటో చెప్పసాగింది అలివేణి.

ఉన్నట్టుండి అంది "రాజేశ్వరి వచ్చిందండీ" అని.

"ఏ రాజేశ్వరి...?" అదిరిపడి తలెత్తాడు అచ్యుతరావు. 'అదేనండి మాపద్మ అక్కయ్యలే. ఊం మీకు తెలీదుకదూ. బహుశా చూసికూడా వుండరు.' భార్య మాటలకు పులుస్టాపు లేదు. అతను కేవలం శ్రోతలా ఉండిపోయాడు.

పద్మ తన స్నేహితురాలని ఆమె అక్క రాజేశ్వరని తను భర్తను వదిలేసి నాటకాల్లో వేషాలు వేస్తుంటుందని, వాళ్ళు ఎవరి ఆహ్వానంమీదో మద్రాసు వెళ్ళి నాటకం వేయగా, తను వేసిన ఆ నాటకం ఓ ప్రొడ్యూసర్ చూసి, తన నటనను మెచ్చుకోవడమేగాక, తనకి సినిమాలో కూడా ఛాన్సు ఇప్పించే ఏర్పాట్లు చేస్తానని మాట ఇవ్వడం, ఇచ్చిన మాటప్రకారం తను ప్రొడ్యూస్ చేసే రెండు చిత్రాల్లో చిన్నపాత్రలివ్వడం కూడా జరిగిందట. మరో చిత్రంలో కాస్త పెద్ద పాత్రే ఇస్తానని ప్రామిస్

చేశాడట. తనకి హీరోయిన్ ఛాన్సు రాగానే మనల్నికూడా మద్రాసు రమ్మంటున్నది" అలివేణి చెప్పడం ఆపి భర్త వైపు చూసింది ఏమంటారు అన్నట్లు. 'అదన్నమాట నీ ఈ సంతోషమంతా' నిట్టూర్చాడతను. ఆలూలేదు సూలూలేదు కొడుకుపేరు సోమలింగం అన్నట్లు ఆవిడను ముందు హీరోయిన్ అవనీ, అప్పుడు మనసంగతి చూడవచ్చు" అన్నాడతను నిర్లక్ష్యంగా నవ్వేస్తూ. "అదృష్టంవుంటే ఎతండి. నిన్న మొన్న సినీఫీల్డ్‌లో ప్రవేశించి ఎక్‌స్ట్రా వేషాలేసే సుభద్ర ఇప్పుడు పెద్ద హీరోయిన్ అవలేదూ, ఇప్పుడు తన లేని సినిమా వుందా?"


"అదృష్టం వుండాలిగా. ఊఁ ఇంతకీ ఆమె ఈ ఊరెందుకొచ్చినట్లు?"

"ఈ సమీపంలోవున్న ఊళ్ళో వాళ్ళ నాటకం వేసారట. అప్పుడెప్పుడో మా ఊరు వెళ్ళినప్పుడు మా అమ్మ చెప్పిందట, నేను ఇక్కడ వున్నట్లు. ఆసంగతి గుర్తుపెట్టుకుని నన్ను వెతుక్కుంటూ వచ్చింది. భోజనానికి ఉండమంటే ఉంది కాదు. వారం పదిరోజుల్లో ఏదో సినిమా అవుట్‌డోర్ షూటింగ్ ఈచుట్టుప్రక్కల జరుగుతుందట. అప్పుడు తప్పకుండా మనింట్లోనే ఉంటానని చెప్పివెళ్ళిందండీ. ఎంతయినా సినిమా మనిషికదూ! ఆ బట్టలు ఆ తీరు ఎంత మారిపోయిందనుకున్నారూ. మొదట నేనసలు గుర్తుపట్టలేకపోయాను. తనే గుర్తులు చెప్పింది పాపం." భార్యలో ఇంత వాక్ చాతుర్యం వుందని అచ్యుతరావుకు తెలీదు. మాటలు రాని మూగదానిలా చాలా ముభావంగా వుండే భార్య అలా పులుస్టాప్ లేకుండా మాట్లాడుతుంటే అతను దిగ్భ్రాంతుడౌతున్నాడు.

అతను భోంచేసివచ్చి మంచంమీద కూర్చున్నా భార్యధోరణి అలాగే సాగుతున్నది, 'అప్పటికి ఇంట్లోకి ఏమేమి తేవాలో, ఇంటిని ఎలా అలంకరించాలో, తనకి మర్యాద లెలా చేయాలో' మొదలైన అంశాలతో.

అలివేణి వంటయింట్లో పనిముగించుకొని వచ్చేసరికి భర్త మంచంమీద పడుకుని గుర్రుకొట్టూ వున్నాడు. చాపమీద పడుకున్న అలివేణికి ఎంతకీ నిదపట్ట లేదు. ఎలాపట్టుంది. రాబోయేది,కాబోయే సినిమా తారాయే. అప్పుడు ఇంటిని ఇలా అతిసామాన్యంగా వుంచితే ఎలా? కిటికీలకు గుమ్మాలకు అందమైన కర్టెన్లు తెప్పించాలి తనకి చెప్పకోతగ్గ చీరలు లేవు. మంచి ఖరీదులో రెండో మూడో కొనిపించుకోవాలి. రెండు మూడు రకాల స్వీట్సు చేసి అట్టిపెట్టాలి. ఓ ఫ్యాను, నాలుగు కుర్చీలు అద్దెకైనా తెప్పించి ఉంచాలి, తనతో ఇంకా ఎవరన్నావస్తే ఇబ్బందిపడకుండా." ఈ రకమైన ఆలోచనలు కుమ్మరిపురుగులా మనసుని దొలుస్తుండగా ఎప్పటికో నిద్రలోకి జారిపోయిందామె.

* * *




అనుకున్నట్లు రాజేశ్వరి రానే వచ్చింది. తను వస్తూ అలివేణికి మంచి పట్టుచీరలు రెండు తెచ్చింది. 'మా చిత్రం షూటింగు చూట్టానికి రావూ అప్పుడు కట్టుకుందువుగాని' అంది. ఆ చీరను చూసి తెగమురిసిపోయింది అలివేణి. 'ఎంతైనా తను సినిమా తారాయే' వాళ్ళ ఎన్నికే గొప్పగా వుంటుంది. తన భర్త కొచ్చే నెలజీతం పెట్టే ఈ చీరలో సగం ముక్క రాదు. వాళ్ళ ఖర్చు ఆ దర్జా ఎవరికొస్తుంది?' అనుకుంది పొంగేమనసుతో.


ఆరోజే షూటింగు. ఒక గ్రూప్‌డాన్సు తీస్తారట. పదిమంది ఆడవారిలో ముందు వరసలో వుంది రాజేశ్వరి. కొన్ని సీపలు రంగు డిజైన్లు వేసిన కుండలను నెత్తి మీద పెట్టుకుని గెంతడం, కొన్ని చేతుల్లో వరినాటుతున్నట్టు, అలా తీశారు. ఆకాస్త షాటుకే ఎన్నో గంటల టైము పట్టింది. కుండలు కొన్ని పగిలిపోవడం, కొందరు సరిగ్గా నెత్తిమీద నిలుపుకోలేకపోవడం, ఇలా ఎన్నోసార్లు తీసిందే మళ్ళీ మళ్ళీ తీస్తుంటే అందులో పాల్గొనేవారికెలా వున్నా చూసే జనానికి మాత్రం చాల విసుగ్గా అనిపించింది.

ఇంకో షాట్, హీరోయిన్‌ని భర్త అనుమానిస్తాడట. ఆ అవమానాన్ని భరించలేక నీళ్ళలో పడిపోతే ఆమెను జాలరివాళ్ళు రక్షిస్తారట. వాళ్ళకూడా హీరోయిన్ వేషం వేసే అమ్మాయి రాలేదు. తనకేదో పనులున్నాయని. ఆ షాట్‌ని ఓ డూప్‌ని పెట్టి తీసారు. అతను మొగాడు. అతనికి విగ్గుపెట్టి, చీరకట్టే దూరానికి అమ్మాయిలాగానే అనిపించాడు. ఆ సమీపంలో వున్న కాలవలోకి ఓ గెంతువేశాడు. అది చూస్తున్న అలివేణి

కెవ్వు నరవబోయి తమాయించు కొంది. 'అతను మునిగిపోతే ఏదైనా ప్రమాదం సంభవిస్తే' అనిపించింది. అటువంటి షాట్‌లో హీరోయిన్‌కి ప్రమాదం జరగకూడదనే డూప్‌ని పెట్టి తీస్తారట అటువంటి దృశ్యాలను. ఆ డూప్ బాగా ఈతవగ్గరా వచ్చినవాడే అయి వుంటాడట. ఆసంగతి రాజేశ్వరి చెప్తుంటే ఎప్పుడో పేపర్లో చదివిన సంగతి గుర్తొచ్చింది అలివేణికి. ఇలాగే ఏదో సినిమా కోసం హీరోకి బదులు డూప్‌ని పెట్టి తీస్తున్నారట. ఆ డూప్ ప్రమాదవశాత్తూ అంత ఎత్తు కొండమీదనుంచి పడేసరికి నిజంగానే దెబ్బలు తగిలి చనిపోయాడట. ఆ వార్త చదివి అయ్యో అనుకుంది. అదే దృశ్యం కంటముందు కనిపించేసరికి ప్రాణం విలవిల్లాడిపోయింది. వాళ్ళకి దినదినగండమే కదా అనిపించింది. షూటింగ్ చూట్టానికి ఆ చుట్టుప్రక్కల్నుంచి చాలా జనమే వచ్చారు. అక్కడొక మహాతీర్థంలా వుంది. షూటింగ్ ముగించుకుని వచ్చేస్తుంటే ఎవరో కొంటె కుర్రాడు రాజేశ్వరిమీద చెయ్యివేసాడట. నీకు బుద్ధివుందిట్రా. నీకు అక్కలూ చెల్లెళ్లూ లేరా అంటూ కస్సునలేచింది రాజేశ్వరి.

'నా అమ్మా, అక్కలూ నీలా బజారు సరుకు కాదు. కులస్త్రీలతో నువ్వు సాటి దానివా' అని వెటకారంగా నవ్వాడు ఆ మంది వున్నారు. ఒకరు రాజేశ్వరి చీర లాగడం ఇంకొకళ్ళు బుజంమీద చెయ్యి వేయడం ఆమె రెచ్చిపోయి వాళ్ళని తిట్టడం, చివికి చివికి గాలివాన అయ్యింది. 'తన్నండి, పట్టుకోండి' అనే అరుపులతో కుర్రాళ్ళు రెచ్చిపోతూ ఆ సినిమావాళ్ళను చుట్టేసారు. వాళ్ళమధ్య చిక్కడిపోయిన అలివేణికి ప్రాణం పైనే పోయినట్లయింది. నేరకవచ్చాను, నా మాన ప్రాణాలు దక్కుతాయా, బిక్కచచ్చిపోయి బెదురు చూపులతో చుట్టూచూసింది, నిస్సహాయురాల్లా—ఎవరో అలివేణి చెయ్యిపట్టుకుని లాగారు. "ఎవరది? ఆమె మన అచ్యుతరావు మాస్టారి భార్య. ఆమె వంటిమీద చెయ్యివేస్తే చంపేస్తాను." ఎవరో గుంపుని చీల్చుకుంటూవచ్చి అరిచారు. అంతే అలివేణి చుట్టూ చేరిన ఆకతాయిమూక దూరంగా తప్పుకుంది. వాళ్ళని హెచ్చరించిన వ్యక్తే, నలుగురు కుర్రాళ్ళని పిలిచి "మన పంతులుగారి భార్యను జాగ్రత్తగా ఇంటికి తీసుకెళ్ళి దిగబెట్టి రండి' అని పురమాయించాడు. అతనికి మనస్సులోనే వేయినమస్కారాలు పెట్టుకుంది అలివేణి. బిక్కమొహంతో, వాళ్ల వెనకాల తలవంచుకుని బైలుదేరిన అలివేణికి ఇల్లుచేరుకునేవరకూ ప్రాణం ప్రాణంలోలేదు. దిక్కులు చూస్తూ కూర్చున్న భర్త దగ్గరకు ఒక్కంగలో చేరుకుని, "ఏమండీ, నేను, నేను : " అంటూ ఒక్కసారిగా గొల్లుమంది;

అబ్బాయి. ఆ అబ్బాయికి సపోర్టు వందఅతన్ని చుట్టుకుపోతూ.




నిద్దట్లో అలివేణి కెవ్వుమన్న శబ్దానికి తృళ్ళిపడి లేచాడు. అలివేణివైపు చూసాడు. నిద్దట్లోనే వెక్కి వెక్కి ఏడుస్తున్నదామె. అతను ఖంగారుపడ్తూ మంచందిగి భార్యసమీపంలోకి వచ్చాడు. "అలివేణీ," 'ఆమెమీద చెయ్యివేసి పిలిచాడు మృదువుగా. గబుక్కున కళ్లు తెరిచి చూసిన అలివేణి అతన్ని వాటేసుకుంటూ "ఏమండీ, నన్ను క్షమించండి. ఇంకెప్పుడూ షూటింగులు చూట్టానికి వెళ్ళను" అంటున్నది. ఆమె శరీరం కంపిస్తున్నదింకా

"ఏమయ్యింది అలివేణీ, ఏదైనా పీడ కల వచ్చిందా?" అన్నాడు అనునయింపుగా.

చుట్టూ పిచ్చిదానిలాచూసిన అలివేణికి తను చూసింది, నిజం కాదని, అదంతా కల అని తెలిసేసరికి కొన్ని క్షణాలు పట్టింది "అబ్బ ఇదంతా కలేనా' ఎంత భయంకరమైన కలో, నిజంగానే తన మానం పోతున్నట్లే భయపడింది. కలే ఇంత భయంకరంగా వుందే! అదే నిజజీవితంలో జరుగుతే తను భరించగలదా? తనకా సినిమాలువద్దూ షూటింగులూవద్దు తను మామూలు గృహిణిగా, పంతులుగారి భార్యగానే వుంటుంది చాలు. తనకే ఆడంబరాలు వద్దుబాబూ. అప్పటికప్పుడు ఓ నిశ్చయానికొస్తూ "క్షమించండి, మీ ఉద్యోగాన్ని ఎంతో అల్పంగా భావించాను. కాని ఆ ఉద్యోగస్తుడి భార్యగానే నా మానప్రాణాలు రక్షించుకోగలిగాను" అంది అతని గుండెల్లో మొహం దాచుకుంటూ భార్య అనే మాటలు ఎవరి గురించో, ఎందుకో గ్రహించుకోని అచ్యుతరావు భార్యను అలాగే గుండెలకత్తుకుంటూ ఆనందపారవశ్యతతో కళ్లు మూసుకున్నాడు.